

దేవుడి నిధులు స్వాహా!

జిల్లాలో ఆదాయం వచ్చే ఆలయాలపై కూటమి నేతలు కన్నేశారు. అనధికారికంగా కమిటీలు ఏర్పాటు చేసి దోపిడీకి తెరతీశారు. - 8లో



తగ్గిస్తారా.. తప్పు ఒప్పుకుంటారా?

అధికారంలోకి వచ్చిన వెంటనే పెట్రో ధరలు తగ్గిస్తామని, ఇప్పుడు పట్టించుకోని లోకేష్ వైఖరిపై అభినయ్ మండిపడ్డారు. - 8లో



జ్యూస్ ఫ్యాక్టరీలకు సహకారం

మామిడి జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులకు బ్యాంకర్ల సహకారం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

మెరుగైన పారిశుద్ధ్యమే లక్ష్యం



మాట్లాడుతున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సంపత్ కుమార్

తిరుపతి తుడా : ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో మెరుగైన పారిశుద్ధ్యమే లక్ష్యంగా నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పనిచేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ సంపత్ కుమార్ ఆదేశించారు. బుధవారం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ మౌర్య, ఆర్డీ విశ్వనాథ్‌తో కలసి వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో అన్ని విభాగాల పనితీరును అభినందించారు. మరింత మెరుగ్గా ఫలితాలు వచ్చేలా పనిచేయాలని సూచించారు.ఇంటింటి చెత్త సేకరణ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు జాగ్రత్తలు చేపట్టాలని కోరారు. పన్నుల వసూలులో మరింత వేగం పెంచాలని చెప్పారు. టౌన్ ప్లానింగ్ విభాగం పక్కా ప్రణాళికతో పనిచేయాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి పాల్గొన్నారు.

'బర్డ్' అభివృద్ధికి కృషి



బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ జగదీష్

తిరుపతి తుడా : బర్డ్ ఆస్పత్రి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని డాక్టర్ జగదీష్ తెలిపారు. బుధవారం ఆయన ఆస్పత్రి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. జగదీష్ మాట్లాడుతూ బర్డ్‌లో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించిన అనుభవం ఉందన్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ స్థాయిలో ఆస్పత్రి గుర్తింపు ఇనుమడించేలా సేవలు విస్తరిస్తామని వెల్లడించారు. అనంతరం పలువురు వైద్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

భవన నిర్మాణాల పరిశీలన



భవనాలను పరిశీలిస్తున్న ఈఓ శ్యామలరావు

తిరుపతి తుడా : స్విమ్స్ ప్రాంగణంలో నిర్మిస్తున్న భవనాలను టీటీడీ ఈఓ శ్యామలరావు అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ముందుగా రోగుల సహాయక వసతి గృహంలోని గదులు, భోజనశాల, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, సిటీ సర్జరీ తదితర వైద్య సేవల కోసం నిర్మిస్తున్న భవనాన్ని సందర్శించారు. సెంట్రల్ కిచెన్, సెంట్రల్ మెడికల్ స్టోర్స్, స్విమ్స్ పద్మావతి ఆస్పత్రి, నిర్మాణంలోని క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ , స్టాఫ్ క్వార్టర్స్, శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం భవనాలను పరిశీలించారు. మౌలిక వసతులు, తదితర అంశాలపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు.కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, టీవీ సత్యనారాయణ, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, మనోహరం పాల్గొన్నారు.

సాగు..వెనకడుగు



ఆర్‌బీకేలో ఎరువుల పంపిణీ (ఫైల్)

వ్యవసాయానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందించింది. రైతాంగం ఆర్థికాభివృద్ధికి అహర్నిశలు కృషి చేసింది. అన్నదాతను ఆదాయ మార్గంలో నడపడమే లక్ష్యంగా విప్లవాత్మక విధానాలను ప్రవేశపెట్టింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా క్షేత్రస్థాయిలో సాగును సంబరంగా మార్చేసింది. సకాలంలో పెట్టుబడి సాయం అందించి కర్షకుల మనసు గెలుచుకుంది. అయితే ఆరుగాలం శ్రమించే రైతన్నను చంద్రబాబు దారుణంగా వంచించారు. కనీస మాత్రం పట్టించుకోకుండా కష్టాల కొలిమిలోకి నెట్టేశారు. గత సర్కారు తీసుకువచ్చిందనే సాకుతో విశిష్ట పథకాలను సైతం నీరుగార్చేసింది. ఈక్రమంలో కూటమి ప్రభుత్వ వైఖరిని చూసి పుడమి తల్లి కన్నీరుపెడుతోంది. దేశానికి వెన్నుముకగా భావించే రైతులను నిలువునా దగా చేయడంపై ఆవేదన చెందుతోంది. పాలకుల సాయం అందక.. వ్యవసాయం గిట్టుబాటు కాక.. అప్పులు తీర్చలేక.. దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్న భూమిపుత్రుల దీనావస్థను గమనించి కుమిలిపోతోంది. – వరదయ్యపాళెం



సత్యవేడులో మూత పడిన అగ్రి ల్యాబ్



● ఇతడి పేరు చెంచురామయ్య. వరదయ్యపాళెం మండలం. ఆయనకు రెండు ఎకరాల భూమి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకంలో భాగంగా నగదు ఐదేళ్లపాటు అందింది. ఈ సొమ్ము పొలం దుక్కులు, విత్తనాలకు ఉపయోగపడేది. సాగుకు ముందే అప్పులు చేయాల్సిన ముప్పు తప్పేది. అలాగే ఆర్‌బీకేల ద్వారా అగ్రికల్చర్ అసిస్టెంట్లు సకాలంలో సలహాలు అందించేవారు. ఒకవేళ ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినా బీమా వచ్చేంది. కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. ఈ ఏడాది సాగు చేసిన వరి పంట దెబ్బతింది. రూ.లక్ష వరకు నష్టం వచ్చింది. అయితే బీమా మాటే లేదు. అన్నదాతా సుఖీభవ కింద చిల్లిగవ్వ ఇవ్వలేదు. ఇప్పుడు సాగు చేయడం కంటే కూడా పొలం బీడు పెట్టుకోవడమే మేలనుకునే దుస్థితి దాపురించింది.

గత ప్రభుత్వంలో పండుగలా వ్యవసాయం

- అన్నదాతకు ఎల్లప్పుడూ అభయం
- రైతు భరోసా కింద పెట్టుబడి సాయం
- ఆర్‌బీకేల ద్వారా పూర్తి సహకారం
- ఏడాదిలో సాగును దండగాలా మార్చిన కూటమి ప్రభుత్వం
- నిరుపయోగంగా రైతు సేవా కేంద్రాలు
- అమలు కాని అన్నదాతా సుఖీభవ
- అప్పుల పాలవుతున్న అన్నదాతలు



వరదయ్యపాళెం మండలం మరదవాడలో మూతపడిన రైతు సేవా కేంద్రం

జిల్లా సమాచారం

సాధారణ సాగు విస్తీర్ణం	3 లక్షల ఎకరాలు
రైతులు	2,76,000
కౌలుదారులు	14,000
రైతు సేవా కేంద్రాలు	442
సీహెచ్‌సీలు	338
అగ్రి ల్యాబ్‌లు	6
జలసిరి కింద వేసిన ఉచిత బోర్లు	506

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT

గత ప్రభుత్వంలో పండుగ



డ్రోన్ టెక్నాలజీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు సంక్షేమానికే పెద్దపీట వేసేవారు. అన్నదాత ఆనందంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నాటి పాలకులు విశ్వసించేవారు. ఇదే లక్ష్యంతో వినూత్నమైన పథకాలు, విధానాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సులువుగా అందించేందుకు ఆర్‌బీకేలను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా అన్నదాతల ఇంటి ముంగిటకే సర్వం అందజేసేవారు. అలాగే సీజన్ ఆరంభానికి ముందే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించేవారు. భూసార పరీక్షలు చేయించి, ఎలాంటి పంటలు సాగు చేయాలో అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా అవగాహన కల్పించేవారు. ఈ క్రమంలోనే పలు చోట్ల అగ్రిల్యాబ్‌లను ప్రారంభించారు. పంటలకు ఉచితంగా బీమా సౌకర్యం కల్పించేవారు. ఒక వేళ పంట నష్టపోతే వెంటనే పరిహారం చెల్లించేవారు. సకాలంలో బ్యాంకుల ద్వారా సున్నావడ్డీ రుణాలు మంజూరు చేయించేవారు. ఇదే విధానాలను కౌలురైతులకు సైతం వర్తింపజేసేవారు. వైఎస్సార్ జలసిరి కింద ఉచితంగా వ్యవసాయ బోర్లు వేయించేవారు. రైతులు పండించే ఉత్పత్తులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టేవారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించి అన్నదాత ఆర్థికంగా బలపడేందుకు పూర్తి సహకారం అందించేవారు. పగటి పూటే 9 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేవారు. సీజన్ మొదలయ్యే సరికే విత్తనాల పంపిణీ చేపట్టేవారు. ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు అందుబాటులో ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకునేవారు.



రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ (ఫైల్)



చంద్రగిరి వద్ద అగ్రి ల్యాబ్‌లో పరీక్షలు

కూటమి పాలనలో దండగ



తొట్టంబేడు మండలంలో పనిచేయని సాంబయ్యపాళెం రైతు సేవా కేంద్రం

కూటమి ప్రభుత్వం అన్నదాతలను ఆమడదూరంలో పెట్టింది. వ్యవసాయానికి కనీస మాత్రం సహకారం కూడా అందించకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ఆరుగాలం కష్టించే రైతులను దగా చేస్తోంది. ఈ క్రమంలో ముందుగా విశిష్ట సేవలందించే ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసేసింది. రైతు సేవా కేంద్రాలు పేరు మార్చి ఒక్క సేవ కూడా అందని దుస్థితికి తీసుకువచ్చింది. అన్నదాతా సుఖీభవ కింద పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20వేల చొప్పున అందిస్తామని బీరాలు పలికి.. ఇప్పుడు ముఖం చాటేస్తోంది. ఇప్పటికే రబీ సీజన్‌లో ఎలాంటి సాయం అందించలేదు. ఇప్పుడు ఖరీఫ్ మొదలైనా ఇదిగో అదిగో అంటూ వాయిదాలు వేస్తోంది. ఈ క్రమంలోనే భూసార పరీక్షలను గాలికి వదిలేసింది. అగ్రిల్యాబ్‌లను నిర్దాక్షిణ్యంగా మూసేసింది. విత్తనాలు, ఎరువుల సంగతే మరచిపోయే పరిస్థితులు తీసుకువచ్చింది. దీంతో రైతులు మళ్లీ దూరాభారం వెళ్లి విత్తనాలు, ఎరువులును కొనుగోలు చేసుకునే రోజులను పునరావృతం చేసింది. ఉచిత పంటల బీమాను తుంగలో తొక్కేసింది. నష్ట పరిహారం ఊసే లేకుండా చేసేసింది. రాయితీపై అందించే వ్యవసాయం పరికరాలను తీసుకోవాలంటేనే రైతులు భయపడే పరిస్థితి కల్పించింది. ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా ఆపేసింది. పంట ఉత్పత్తులను దళారుల పాలు చేసేసింది. ఇక కౌలు రైతులనైతే పూర్తిగా విస్మరించింది. మొత్తం మీద కేవలం ఒక్క ఏడాదిలోనే వ్యవసాయం దండగ అని అన్నదాతలే అనుకునే దుస్థితిని తీసుకువచ్చింది.



మత్తేరి మిట్టలో నిరుపయోగం రైతు భరోసా కేంద్రం

ఉత్తుత్తి మాటలే



గత ప్రభుత్వ హయాంలో సాగు చేసిన పంటలు ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతింటే ఒక్క రోజులోనే పరిశీలించేవారు. వెంటనే నష్ట పరిహారం అంచనాలు వేసి ఆర్థికసాయం అందజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి ఉత్తుత్తి మాటలే చెబున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో 7 ఎకరాలో వరి నాటేందుకు నారుమళ్లు సిద్ధం చేసుకుంటే వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. అయినప్పటికీ కనీసం విత్తనాలు కూడా రాయితీపై ఇవ్వలేదు. ఇలాగే ప్రభుత్వ వైఖరి ఉంటే వ్యవసాయం పూర్తిగా వదిలేయాల్సిందే.

– తలారి ముత్యాలయ్య, చిట్టమూరు మండలం

ఉచిత బోరు ఊసే లేద



గత ప్రభుత్వంలో వైఎస్సార్ జలసిరి పేరుతో అర్హత కలిగిన ప్రతి రైతుకు ఉచితంగా బోరు వేసి ఆదుకునేవారు.ఇందులోనే మేమంతా లబ్ధిపొందాం. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ఉచిత బోర్లు అనే పథకం ఊసే లేకుండా పోయింది.గతంలో నియోజక వర్గానికి రెండు బోరు మిషన్లను కేటాయించి ప్రతిగ్రామంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉచితంగా బోర్లు వేశారు.ఇప్పుడు ఆపథకం ఉందా?లేదా అనేది కూడా చెప్పేవారే లేరు.

– ఏకోలు వెంకటయ్య రైతు, కమ్మవారిపల్లె, వెంకటగిరి మండలం

నిర్వీర్యం చేశారు



గత ప్రభుత్వ హయాంలో రైతులకు అన్ని సేవలను గడప వద్దకే అందజేయాలనే ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా పచ్చరొట్ట విత్తనాలు, సబ్సిడీపై ఎరువులు, సవిత్తనాలు, పరికరాలు అందించారు. పంటల బీమా సైతం నమోదు చేసేవారు. ప్రస్తుతం రైతు సేవాకేంద్రాలుగా మార్చినా వాటిని తెరవడం లేదు. గత ప్రభుత్వంలో ధాన్యం బస్తా రూ.2వేల నుంచి రూ.2,500 వరకు ఉండేది. ఇప్పుడు రూ.1,500 మాత్రమే పలుకుతోంది.

– శేఖర్, దేగావారి కండ్రిగ, సూళ్లూరుపేట మండలం

అన్ని విధాలుగా దగా



కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా దగా చేస్తోంది. నాకు ఒకటిన్నర ఎకరా ఉంది. గత సర్కారు హయాంలో సీజన్‌కు ముందుగానే రైతు భరోసా సొమ్ము అందించారు. విత్తనాల నుంచి ఎరువుల వరకు రాయితీపై పంపిణీ చేశారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించారు. ఇప్పుడు ప్రభుత్వం రైతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పెట్టుబడి సాయం లేదు. రైతు సేవా కేంద్రాలు అన్నారు.. వాటిని ఎప్పుడూ మూసే ఉంటున్నారు. ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కేశారు.

– ఎస్.రమణారెడ్డి, నరసారెడ్డి కండ్రిగ, నాయుడుపేట

సంబరంగా సాగు చేశాం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంబరంగా సాగు చేశాం. వ్యవసాయంలో నాలుగు రాళ్లు సంపాదించాం. అప్పట్లో పెట్టుబడి సాయంగా ఏటా రైతు భరోసా కింద నగదు అందించేవారు. ఆర్‌బీకేల ద్వారా ఇంటికే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు వచ్చేవి. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేవారు. పుష్కలంగా సాగునీరు సరఫరా చేసేవారు. దీంతో మా కుటుంబాలు హాయిగా జీవనం సాగించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వ్యవసాయం అంటేనే భయపడాల్సిన దుస్థితి దాపురించింది.

– పాకాల ఏడుకొండలు, తిప్పిరెడ్డిపల్లి, సైదాపురం మండలం

నిలువునా మోసం చేశారు



గతంలో చంద్రబాబు రుణమాఫీ అంటూ రైతులను నిలువునా మోసం చేశారు. ఇప్పుడు కూడా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు ఇస్తామని గాలికి వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా.. రైతులకు పైసా కూడా విదల్చలేదు. సాయం కోసం ఎదురు చూపులు తప్పని దుస్థితి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా ప్రతి రైతుకు పెట్టుబడి సహాయంగా రూ.13.500 నేరుగా ఖాతాలోనే జమ చేసేవారు. ఈ సీజన్‌లో సాగు చేద్దామంటే అప్పులు చేయాల్సి వస్తోంది.

– దామోదర్‌రాజు, రాజుల ఎరుగుంటపాళెం, సైదాపురం మండలం

ప్రయాణికులకు 'మహా' కష్టాలు

- బస్సులు లేక ప్రజల ఇక్కట్లు
- మహానాడుకు వెళ్లిన 365 సర్వీసులు



తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు

తిరుపతి అర్బన్ : ప్రజా రవాణా వ్యవస్థను ప్రభుత్వం పార్టీ సేవలకు వాడేస్తోంది. కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు జిల్లా నుంచి 365 బస్సులను తరలించేసింది. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం ఆర్టీసీ బస్టాండ్లలో పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించింది.

11 డిపోల నుంచి తరలింపు

జిల్లాలో మొత్తం 11 ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. దాదాపు అన్ని డిపోల నుంచి మహానాడుకు సర్వీసులు కేటాయించారు. అయితే ఒక్క వెంకటగిరి నుంచే 50 బస్సులను పంపించడం వివాదాస్పదంగా మారింది. ఈ డిపోలో ఉండేది వంద బస్సులైతే అందులో సగం తరలించడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. టీడీపీ సమావేశానికి ప్రజలను ఇబ్బంది పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

పడిగాపులు

జిల్లాలోని అన్ని బస్టాండ్లలో ప్రయాణికులకు పడిగాపులు తప్పడం లేదు. పార్టీ మీటింగ్‌ల పేరుతో సామాన్య ప్రజలను అవస్థలకు గురిచేయడంపై ఆర్టీసీ ఉద్యోగులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచి పద్ధతి కాదు



ఇటీవల అమరావతికి ప్రధానమంత్రి వస్తున్నారని ఆర్టీసీ బస్సులను భారీ సంఖ్యలో పంపించారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ మహానాడు అంటూ వందలాది బస్సులను పంపేశారు. ఇక్కడ ప్రయాణికులు బస్టాండ్లలో అవస్థలు పడుతున్నారు. పార్టీ మీటింగ్‌లకు ప్రైవేట్ బస్సులు తీసుకోవాలి. అంతే కానీ, ఇలా చేయడం మంచి పద్ధతి కాదు. – శేఖర్, తిరుపతి


తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.99,180
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.8,978
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.1,00,700
రిటైల్ వెండి గ్రాము రూ.103.70

క్లుప్తంగా

ఎస్వీయూ ఎగ్జామినేషన్ డీన్‌గా సురేంద్రబాబు


వీసీ, రిజిస్ట్రార్ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న సురేంద్రబాబు

తిరుపతి సిటీ: ఎస్వీయూ లైబ్రరీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ప్రొఫెసర్ కె.సురేంద్రబాబును వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్‌గా నియమిస్తూ వీసీ అప్పారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సురేంద్రబాబు వీసీ చాంబర్‌లో వీసీ, రిజిస్ట్రార్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. గతంలో డీన్‌గా ఉన్న ప్రొఫెసర్ ఎస్ కిషోర్ నుంచి ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


కాంతమ్మ మృతదేహం

పాకాల : మండలంలోని మొగరాల పంచాయతీ గెనుంగుట్ల పల్లెలో విద్యుదాఘాతంతో ఓ వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. వివరాలు.. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఆన్ చేశారు. అదే సమయంలో ఇంటి గేటును పట్టుకుని ఉన్న కాంతమ్మ(74)కు షార్ట్ సర్క్యూట్ కారణంగా కరెంట్ షాక్ తగిలింది. దీంతో అక్కడికక్కడే మరణించింది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలికి గాయాలు


మరియమ్మకు కాలు విరిగిన దృశ్యం

పాకాల : మండలంలోని ఇరుగురురంగయ్యగారిపల్లె వద్ద బుధవారం రోడ్డు దాటుతున్న మరియమ్మ అనే వృద్ధురాలిని 104 వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మరియమ్మ కుడి కాలు విరిగింది. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.


కర్ణాటకలోని పెట్రోల్ బంకులో ధరలు



కుప్పంలోని పెట్రోల్ బంక్‌లో ధరలు

తగ్గిస్తారా..

తప్పు ఒప్పుకుంటారా?

వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి దూకుడుకు కూటమి ప్రభుత్వం నానా అవస్థలు పడుతోంది. ఎన్నికల హామీల అమలులో మీనమేషాలు లెక్కిస్తున్న సర్కారును నిత్యం ఇరుకున పెడుతుండడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. మొన్నటికి మొన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై వినూత్న రీతిలో తెలిపిన నిరసనగా సమాధానం చెప్పుకోలేక సతమతమైంది. తర్వాత సూపర్ సిక్స్ హామీలను క్షేత్రస్థాయిలో ఎండగట్టడంతో కూటమి గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయ్యింది. ఈ క్రమంలోనే యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేష్ నాటకీయంగా చూపించిన పెట్రో ధరల విషయాలను గుర్తుచేస్తూ ఇరుకున పెట్టడంతో ఏం చేయాలో తెలియక తలపట్టుకుంటోంది.

- యువగళం హామీ హామీ అమలు చేయాలి
- పెట్రో ధరలు వెంటనే తగ్గించాలి
- లేకుంటే ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- నారా లోకేష్‌కు భూమన అభినయ్ డిమాండ్

సాక్షి ప్రతినిధి, తిరుపతి : రాజకీయాల్లో విశ్వసనీయత ఉండాలంటే నేతలు మాట ఇస్తే దాని మీద నిలబడాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలో యువగళం సందర్భంగా నారా లోకేష్ కర్ణాటక, ఆంధ్రలో పెట్రో ధరల మధ్య తేడాను చూపుతూ విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే పెట్రో ధరలు తగ్గిస్తామని ఆర్భాటంగా హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా.. ఇప్పటికీ సదరు హామీ అమలు కాకపోవడంతో భూమన అభినయ్ మండిపడ్డారు. బుధవారం వేకువజామున కర్ణాటకలో లోకేష్ వెళ్లిన పెట్రోల్ బంక్‌కే వెళ్లి పెట్రోల్ పట్టించుకున్నారు. ధర ఎంత ఉందో బహిరంగంగా ప్రదర్శించారు. వెంటనే కుప్పంలో లోకేష్ వెళ్లిన బంక్‌లోనే పెట్రోల్ తీసుకుని ధరను చూపించారు. కర్ణాటక కంటే కుప్పంలో పెట్రోల్ ధర ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన మాట మేరకు వెంటనే పెట్రో ధరలు తగ్గించాలని కోరారు. లేకుంటే తప్పు ఒప్పుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నినాదాలు చేస్తున్న అభినయ్, వైఎస్సార్‌సీపీ నేతలు


పరేషన్‌పై మహిళల నిరసన

వెంకటగిరి రూరల్ : రేషన్ సరుకులను ఇంటి ముంగిటకే చేర్చే ఎండీయూ వాహనాలను రద్దు చేయడంపై మహిళలు మండిపడ్డారు. చౌక దుకాణాల్లోనే బారులు తీరి సరుకులు తీసుకోవాలని ఆదేశించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఈ మేరకు పట్టణంలోని వల్లివేడు క్రాస్ వద్ద నిరసనకు దిగారు. మహిళలు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన విధానంలోనే రేషన్ పంపిణీ చేయాలని నినాదాలు చేశారు. దుకాణాల వద్ద పడిగాపులు కాయలేమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయని, గతంలో మా వద్దకే వచ్చి సరుకులు ఇచ్చేవారని, ఇప్పుడు పట్టణంలోని మనులాలాపేటలోని దుకాణానికి వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. అలాగే ఏఎంసీ గోడౌన్, పరశురామ్ కాలనీ వాసుల కూడా 5 కిలోమీటర్ల దూరంలోని మనులాలాపేటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. చివరకు 5 కేజీల బియ్యం తెచ్చుకునేందుకు సైతం ఆటో చార్జీకి రూ.40 వెచ్చించాల్సి వస్తుందని తెలిపారు. సరుకుల తీసుకోకుంటే కార్డు రద్దు చేస్తారని రేషన్ షాపు నిర్వాహకులు చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటి వద్దకే సరుకులు తీసుకువచ్చే ఎండీయూ వాహనాలను పునరుద్ధరించాలని కోరారు.


నిరసన తెలుపుతున్న మహిళలు

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 82,597 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,803 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

తుడాను సందర్శించిన 'కాగ్'


అధికారుల సమావేశంలో కాగ్ బృందం

తిరుపతి తుడా : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)ను బుధవారం కాగ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వీసీ మౌర్య తుడా చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న అకౌంటింగ్ విధానాలను కాగ్ బృందానికి వివరించారు. డిజిటలైజేషన్‌కు తక్షణం చర్యలు చేపట్టాని కాగ్ కమిటీ అధికారులకు సూచించింది. సమావేశంలో అడిషనల్ డిప్యూటీ కాగ్ రీవూ ప్రకాష్, కాగ్ డైరెక్టర్ జనరల్ రష్మీ అగర్వాల్, డిప్యూటీ అకౌంటింగ్ జనరల్ ఎన్‌వీ నిఖిత, సీనియర్ డిప్యూటీ అకౌంటింగ్ జనరల్ ఆర్.శ్యామ్, తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరొకరి అరెస్ట్

శ్రీకాళహస్తి : పట్టణ శివారులో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురుని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకోబోగా ముగ్గురు పట్టుబడ్డారు. ఇద్దరు పరారయ్యారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నాలుగో నిందితుడు సురేష్(48)ను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

జ్యూస్ ఫ్యాక్టరీలకు సహకారం

తిరుపతి అర్బన్ : జిల్లాలోని మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలకు సహకారం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి బ్యాంక్ అధికారులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ యజమానులు తీసుకున్న రుణాలను రీషెడ్యూల్ చేయాలని సూచించారు. ఈ క్రమంలోనే ఫ్యాక్టరీ వారు సైతం మామిడి కొనుగోళ్లలో రైతులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

టెంపో ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన సాధిక్‌బాషా

పాకాల : మండలంలోని దామలచెరువు వద్ద జాతీయ రహదారిపై టెంపో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. కల్లూరుకు చెందిన సాధిక్‌బాషా(40) స్కూటీలో వస్తుండగా అక్కగార్ల ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న టెంపో వేగంగా ఢీకొంది. దీంతో సాధిక్‌బాషా అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి రైతులకు సాంకేతికతపై అవగాహన


శ్రీనివాసులు, శాస్త్రవేత్త

రేణిగుంట : వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై గురువారం నుంచి అవగాహన కల్పించనున్నట్లు రాస్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఖరీఫ్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వినియోగించాల్సిన టెక్నాలజీని వివరించనున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐపీపీబీ ఖాతాలకు ఆధార్ లింక్ తప్పనిసరి

తిరుపతి సిటీ : సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ఖాతాలకు తప్పనిసరిగా ఆధార్ లింక్ చేసుకోవాలని తిరుపతి సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ బి.నరసప్ప తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాల నగదు నేరుగా ఖాతాలో జమయ్యేందుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఖాతాదారులు వెంటనే సంబంధిత పోస్టాఫీసులలో సీడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఈ మేరకు సచివాలయాల్లో జూన్ 4వతేదీ లోపు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు వివరించారు.

సముద్రంలో మునిగి బాలిక మృతి


పల్లవి (ఫైల్)

కోట : మండలంలోని శ్రీనివాససత్రం బీచ్‌లో బుధవారం సముద్రంలో మునిగి ఓ బాలిక మృతి చెందింది. వివరాలు.. స్థానిక మత్స్యకారుడు అక్కయ్యగారి లక్ష్మయ్య, సోమియా దంపతుల కుమార్తె పల్లవి(13) తిరుపతిలో చదువుకుంటూ వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. బంధువులతో కలిసి సముద్రస్నానానికి వెళ్లింది. అలల ఉధృతికి మునిగిపోయింది. సమీపంలోని మత్స్యకారులు వెంటనే బాలికను బయటకు లాగేశారు. అపస్మారకస్థితికి చేరడంతో హుటాహుటిన చింతవరం వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే బాలిక మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై ఎలాంటి సమాచారం అందలేదని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

సిఫార్సు లేఖతో ఎంపిక చేసిన చైర్మన్ పేరిట ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధి


ఆధ్యాత్మికతకు తిరుపతి జిల్లా పుట్టినిల్లు.. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆలయాలకు వచ్చే ఆదాయంతో ఆధ్యాత్మికతను మరింత పెంపొందించాల్సిన నేతలు ఇప్పుడు ఆలయ అధికారులను అడ్డు పెట్టుకుని తమ జేబులు నింపుకోవడం మొదలెట్టారు. పైగా సాంస్కృతిక కార్యక్రమాల మాటున రికార్డింగ్ డ్యాన్స్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అనధికార కమిటీలతో కలిసి కొందరు దేవదాయశాఖ అధికారులు కూడా ఆలయాల నిధులను దుర్వినియోగం చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.

దేవుడి నిధులు స్వాహా!

- 11 నెలల పాలనలో ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న కూటమి నేతలు
- అనధికారికంగా పలు ఆలయాలకు కమిటీల నియామకం
- ఆలయంలోకి అడుగిడగానే నిధులపై కన్ను
- ఆలయ నిధులతో ఏకంగా రికార్డింగ్ డ్యాన్సులు
- చూసీచూడనంట్లు పోండయ్యా అంటూ అధికారులకు ప్రజాప్రతినిధుల సలహా
- అన్నింటిలో జోక్యం.. చేష్టలుడిగి చూస్తున్న పలువురు ఈఓలు

చిల్లకూరు: జిల్లాలో ఆదాయం వచ్చే ఆలయాలపై కూటమి నేతల కన్ను పడింది. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో అనధికారికంగా కమిటీలు ఏర్పాటు చేసుకుని పెత్తనం చెలాయిస్తున్నారు. కొందరు ఈఓలు వారి పెత్తనాన్ని తట్టుకోలేకపోతుంటే.. మరికొందరు మాత్రం దొరికిందే అవకాశం అన్నట్లు ఆలయ నిధులను అనవసర కార్యక్రమాలు నిర్వహించి చేతివాటం చూపిస్తున్నారు. మామూలుగా అయితే ఆదాయం రూ.5 లక్షలకు మించి వచ్చే ప్రతి ఆలయాలకు ప్రభుత్వం పాలక మండలి కమిటీలను నియమిస్తుంది. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇప్పటివరకు వీటి గురించి పట్టించుకోలేదు. అయితే కొందరు నేతలు మాత్రం తమ ప్రాంత పరిధిలోని ఆలయాలకు తామే కాబోయే కమిటీ అధ్యక్షుడిని అంటూ ఈఓలపై అప్పుడే పెత్తనం చెలాయిస్తున్నారు. దీంతో కొందరు ఈఓలు కూటమి నేతల పెత్తనాన్ని తట్టుకోలేక చేష్టలుడిగి చూస్తున్నారు. కొంతమంది ఈఓలు ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని అనధికారిక కమిటీలతో కలసి చేతివాటం చూపిస్తున్నారు. అనవసర ఖర్చులు చేయిస్తూ దేవుడి నిధులను స్వాహా చేస్తున్నారు.

గూడూరు డివిజన్‌లో 23 ఆలయాలకు..

గూడూరు డివిజన్ పరిధిలోని గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో సుమారు 23 ఆలయాల్లో గత ప్రభుత్వం పాలకమండళ్లు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని రద్దు చేయడంతో ఇప్పుడు ఆయా ప్రాంతాల్లో ఉండే స్థానిక కూటమి నేతలు ఆలయాల్లో జరిగే జాతరలు, ఉత్సవాలు, పండుగలు నడిపించేందుకు పట్టుబడుతున్నారు. వారికి సపోర్టుగా స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చూసీచూడనట్లు పోండయ్యా అని దేవదాయశాఖ అధికారులతో చెప్పడంతో ఆలయ ఈఓలు మాకు ఏంటి ఈ ఖర్మ అనుకుంటూ వారు చెప్పినట్లు నడుచుకుంటున్నారు.

బడ్జెట్ ఆమోదం పొందిన తరువాతే..

ఆలయ కమిటీల మెంబర్లమని చెప్పుకుంటున్న నేతలు ఆడిటర్లకు వాటాలు పంచుతూ కార్యక్రమాల్లో ఆధ్యాత్మికతను పక్కన పెట్టి రికార్డింగ్ డ్యాన్సు(ఈవెంట్)లు చేయించి ఇష్టారీతిలో భారీగా నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో గత నెలలో నాలుగు రోజుల పాటు జరిగిన జాతరకు ఆరు లక్షల మంది వరకు భక్తులు వచ్చారు. తద్వారా ఆలయానికి సుమారు రూ.కోటి వరకు ఆదాయం వచ్చింది. ఇదే మండలంలోని తమ్మినపట్నంలో కోదండరామస్వామి ఆలయానికి కూడా రూ.కోట్ల నిధులు ఉన్నాయి. మరి ఈ ఆలయంలో నవమి వేడుకలను నిర్వహించేందుకు దేవదాయశాఖ ఎన్ని రూ.లక్షల నిధులు విడుదల చేసిందనే విషయం తెలియదు. కానీ అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న కమిటీ ఆ నిధులతో పాట కచేరీలు, డ్యాన్స్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఆలయానికి కొత్తగా వచ్చిన ఈఓ కూడా నిధుల వినియోగంలో ఉన్నతాధికారులను ఏమార్చి భారీస్థాయిలో ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఎక్కడైనా రికార్డింగ్ డ్యాన్స్‌లు ఏర్పాటు చేస్తే అడ్డుకునే పోలీసులు ఈ కార్యక్రమాలను దగ్గర ఉండి ప్రోత్సహించడం కొసమెరుపు. దీన్ని బట్టి దేవదాయశాఖ నిధులు ఎంత దుబారా చేస్తున్నారనే విషయం తేటతెల్లమవుతోంది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోయినా..

ఆలయాల కమిటీలను దేవదాయశాఖ ఏర్పాటు చేయకపోయినా కూటమికి చెందిన నాయకులు అనధికారికంగా ఆలయ కమిటీల అధ్యక్షులతో పాటు సభ్యుల పేరిట ఫ్లెక్సీలు, కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, క్యాలెండర్లు వేయించి ప్రచారం చేసుకుంటున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిసినా.. దేవదాయశాఖకు చెందిన ఒక్క అధికారి కూడా దీన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధి ఇచ్చిన సిఫార్సు లేఖతో నియామకాలు చేయించుకుని ఆలయాల నిధులను దుర్వినియోగం చేస్తున్నారు.

జీఓ విడుదల చేయలేదు..

"ఆలయాల్లో పాలక మండళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి జీఓ విడుదల చేయలేదు. కనీసం ఉత్సవ కమిటీలను కూడా నియమించేలా ఆదేశాలు అందలేదు. పలు ఆలయాల్లో కమిటీలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించుకుంటున్న విషయం నా దృష్టికి రాలేదు. ఇలాంటివి ఏమైనా ఉంటే ఆయా ఆలయాల ఈఓలతో మాట్లాడి చర్యలు చేపడతాం. తమ్మినపట్నం కోదండరామస్వామి ఆలయంలో అనుమతులు లేకుండానే నవమి ఉత్సవాలకు భారీగా ఖర్చు చేసిన విషయాలు ఆర్‌జేసీ ఆజాద్ చూశారు. నాకు ఆ విషయం తెలియదు.

– రామకృష్ణారెడ్డి, దేవదాయశాఖ కమిషనర్, తిరుపతి


మల్లాం ఆలయానికి పాలకమండలి లేకపోయినా కమిటీ పేరిట రూపొందించిన క్యాలెండర్


శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన రికార్డింగ్ డ్యాన్సు